సాక్షి ప్రకాశం

సోమవారం । 20 । జనవరి । 2025



ప్రాణం తీసిన మద్యం మత్తు

మద్యం మత్తులో అతివేగంగా కారు నడపడంతో అదుపు తప్పి స్తంభాన్ని ఢీకొట్టి ఓ వ్యక్తి మృతిచెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. - 8లో..



వారం తర్వాత వెలుగులోకి రోడ్డు ప్రమాదం

రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన వారం తరువాత వెలుగులోకి వచ్చింది. - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం 31/22

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పొగమంచు కురుస్తుంది. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

సనాతన ధర్మ రక్షణ ఎక్కడ పవన్

- ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్



టంగుటూరు: సనాతన ధర్మ రక్షణ ఎక్కడ పవన్ కళ్యాణ్ అని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం తిరుమలలో శ్రీవారి దర్శనం అనంతరం హైదరాబాద్ తిరుగు ప్రయాణంలో టంగుటూరు లోని జూనో బేకరీ వద్ద కొంత సమయం సేద తీరడానికి ఆగారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను సనాతన ధర్మాన్ని గౌరవిస్తాను, పాటిస్తాను అని చెప్పే పవన్ కళ్యాణ్ తిరుమలలో సనాతన ధర్మాన్ని పాటిస్తున్నావా అని ప్రశ్నించారు. మీరు చేసే పాపాలే తిరుమలలో సంఘటనలకు కారణమవుతున్నాయని, దీనికి ఎవరిని బాధ్యులు చేస్తారని, మీరే బాధ్యులుగా ఉంటారా అని ప్రశ్నించారు. నెల వ్యవధిలో తొక్కిసలాట, అగ్ని ప్రమాదం జరిగాయని, మీ ప్రభుత్వం నిర్లక్ష్యం వలన భక్తుల ప్రాణాలను పొట్టన పెట్టుకున్నారని విమర్శించారు. తిరుమలలోకి గుడ్లు, బిర్యాని వంటి పదార్థాలు ఎలా వస్తున్నాయని ప్రశ్నించారు. తిరుమలలో జరిగే ఈ సంఘటనలకు నీవు బాధ్యత వహిస్తావా? ఈ నెపాన్ని ఎవరి మీదకైనా తోసి వేస్తావా అని అడిగారు.

గడ్డి పెంపకంపై అటవీశాఖ సిబ్బందికి శిక్షణ

- శిక్షణ ఇచ్చిన 'గ్రాస్‌మ్యాన్ ఆఫ్ ఇండియా' గజానన్ దాదా మురాత్కర్



గడ్డి పెంపకంపై అవగాహన కల్పిస్తున్న ప్రొఫెసర్ గజానన్ దాదా మురాత్కర్

పెద్దదోర్నాల: గడ్డి పెంపకంపై అటవీశాఖ సిబ్బందికి అవగాహన కల్పిస్తూ వారికి శిక్షణ తరగతులను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని తుమ్మలబైలు వద్ద నిర్వహించిన కార్యక్రమంలో గిద్దలూరు, మార్కాపురం డివిజన్‌కు చెందిన అధికారులతో పాటు గ్రాస్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా పిలిచే ప్రొఫెసర్ గజానన్ దాదా మురాత్కర్ పాల్గొని గ్రాస్ మేనేజ్‌మెంట్ టెక్నిక్‌పై సిబ్బందిపై అవగాహన కల్పించారు. గడ్డి పెరుగుదలతో పర్యావరణ పరిరక్షణ జరుగుతుందని, శాఖాహార వన్యప్రాణులు పెరుగుదల ఉంటుందన్నారు. దీని వల్ల మాంసాహార వన్యప్రాణులు సైతం పెరిగే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కాపురం, గిద్దలూరు డిప్యూటీ డైరెక్టర్లు సందీప్ కృపాకర్, నీషా కుమారి, సబ్ డీఎఫ్‌ఓలు వేణు, శ్రీకాంత్‌రెడ్డి, రేంజి అధికారులు వరప్రసాద్, జీవన్‌కుమార్, ప్రసన్నజ్యోతి, సుబ్బారావు, నీలకంఠేశ్వరరెడ్డి, సత్యనారాయణరెడ్డి, సుజాత, డీఆర్వోలు పాల్గొన్నారు.

సమస్యల ఒరబడి

పేదలకు కార్పొరేట్ విద్య అందించాలన్న లక్ష్యంతో మనబడి నాడు–నేడు ద్వారా ప్రభుత్వ బడుల రూపురేఖలు మార్చేసింది గత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్. పాఠశాలలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దటమే కాకుండా అధునాతన వసతులు కల్పించింది. విద్యార్థుల బంగారు భవితకు బాటలు వేసింది. కానీ కూటమి ప్రభుత్వం విద్యారంగాన్ని గాలికొదిలేసింది. ఎన్నికల కారణంగా నిలిచిపోయిన నాడు–నేడు రెండో దశ పనులకు మంగళం పాడేసింది. మౌలిక వసతులు కొరవడడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.



ఒంగోలు రామ్‌నగర్‌లో మున్సిపల్ హైస్కూల్ లో నిలిచిన అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు

- ప్రభుత్వ పాఠశాలల్లో నాడు–నేడు పనులపై నీలినీడలు
- ముందుకు సాగని రెండో విడత ఆధునికీకరణ పనులు
- గదులు, మౌలిక వసతుల కొరతతో విద్యార్థుల ఇబ్బందులు
- పాఠశాలల్లో పనిచేయని వాటర్ ప్లాంట్లు
- పట్టించుకోని విద్యాశాఖాధికారులు

ఒంగోలు సిటీ:

జిల్లాలో 2,407 ప్రభుత్వ పాఠశాలల్లో 1,90,410 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలల అభివృద్ధికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మనబడి నాడు-నేడు పథకాన్ని ప్రారంభించింది. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆధునిక వసతులు కల్పించేందుకు పనులు చేపట్టింది. అందులో భాగంగా తొలివిడతగా జిల్లాలో 1015 పాఠశాలలను ఎంపిక చేసింది. వాటికి రూ.229.61 కోట్లు కేటాయించింది. వీటితో 7431 పనులు పూర్తి చేసింది. తరగతి గదుల నిర్మాణం, ఆధునికీకరణ, ఫర్నిచర్, గ్రీన్ చాక్‌బోర్డులు, ఇంగ్లిష్ ల్యాబ్‌లు, వాటర్ ప్లాంట్లు, ప్రహరీలు, మరుగుదొడ్ల నిర్మాణం, మరమ్మతులు, విద్యుదీకరణ ఇలా వివిధ పనులను పూర్తి చేసి కార్పొరేట్ స్కూళ్లను తలదన్నేలా చేసింది. మొదటి విడతలో చేసిన పనులతో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తమ స్కూళ్లను చూసి ఆశ్చర్యపోయారు. మా పిల్లలకు మంచిరోజులొచ్చాయంటూ సంబరపడిపోయారు. ఇక జిల్లా వ్యాప్తంగా రెండో దశలో 979 పాఠశాలు అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపిక చేసింది. ఇందుకు సంబంధించి రూ.417.31 కోట్ల నిధులు కూడా మంజూరు చేసింది.

నాడు-నేడు రెండో దశ పనుల్లో మరమ్మతులకు సంబంధించి 404 మరుగుదొడ్లకు గాను 402 పనులు పూర్తి చేశారు. 538 పాఠశాలలకు విద్యుదీకరణ చేయాల్సి ఉండగా 529 పాఠశాలలకు పనులు పూర్తి చేశారు. 670 వంట గదులకు గాను 669 వంట గదుల నిర్మాణాలను పూర్తి చేశారు. 522 తరగతి గదుల మరమ్మతులు చేయాలని నిర్ణయించగా 520 పనులు పూర్తయ్యాయి. 80 పాఠశాలల్లో 71 తరగతి గదుల నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. అవి వివిధ దశల్లో ఉన్నాయి. సార్వత్రిక ఎన్నికల వరకు పనులు వేగవంతంగా సాగాయి. ఎన్నికల కోడ్ కారణంగా పనులు నిలిచిపోయాయి. అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. తరువాత పనులకు అతీగతీలేకుండా పోయింది. పాఠశాలల అభివృద్ధి పనులపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఏడు నెలలు కావస్తున్నా పెండింగ్ పనులకు పైసా నిధులు విడుదల చేయలేదు. ఒక్కసారి కూడా నాడు-నేడు పనులపై సమీక్ష జరగలేదు. కొన్ని పాఠశాలల్లో గదులు శ్లాబ్‌లు పోసి వదిలేశారు. కొన్ని చోట్ల గదులు పూర్తయినా ప్లాస్టింగ్, కిటికీలు, రంగులు వేయకుండా కాలయాపన చేస్తున్నారు. కారణాలు అడిగితే సిమెంట్ కొరత, మేస్త్రీలు రావడం లేదని, కూలీలు అందుబాటులో లేరని, నిధులు విడుదల కాకపోవడమేనని కాంట్రాక్టర్లు, అధికారులు చెబుతున్నారు. దీంతో అరకొర వసతుల మధ్య విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనను పూర్తిగా వదిలేశారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అదనపు తరగతి గదుల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేస్తే విద్యార్థులు చెట్ల కింద, ఆవరణలో పాఠాలు చెప్పాల్సిన అవసరం ఉండదని ఉపాధ్యాయులు చెబుతున్నారు. నిలిచిన నిర్మాణాలు పూర్తి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

మౌలిక వసతుల్లేక అవస్థ..

కూటమి ప్రభుత్వం మిగిలిపోయిన పనులపై దృష్టి సారించకపోవడంతో పాఠశాలల్లో మౌలిక వసతులు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం, సీబీఎస్ఈ, టోఫెల్ పరీక్ష విధానం తదితర వాటికి కూటమి ప్రభుత్వం మంగళం పాడింది. ఈ నేపథ్యంలో ఈ విద్యా సంవత్సరం పూర్తయ్యే నాటికైనా మిగిలిపోయిన నాడు- నేడు పనులు పూర్తి చేస్తారా లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా పాఠశాలల్లో వాటర్ ప్లాంట్లు పనిచేయకపోవడంతో విద్యార్థులు మధ్యాహ్న భోజన సమయంలో ఇంటి వద్ద నుంచి బాటిల్స్ తీసుకొస్తున్నారు. ఒంగోలు కార్పొరేషన్ పరిధిలోని రామ్‌నగర్‌లో ఆర్వో ప్లాంటు పనిచేయక మంచినీరు రావడం లేదు. విద్యార్థుల కోసం క్యాన్లు కూడా తీసుకురాకపోవడంతో అవస్థలు పడుతున్నారు. ఇది ఒక ఉదాహరణ మాత్రమే. దాదాపు అన్ని స్కూళ్లలో ఇదే పరిస్థితి నెలకొని ఉంది. అదనపు తరగతి నిర్మాణ గదులు పూర్తికాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఉపాధ్యాయ సంఘాల నాయకులు అంటున్నారు. అలాగే గత ప్రభుత్వంలో అన్ని రకాల సౌకర్యాలు, హంగులతో రూపుదిద్దిన ప్రభుత్వ పాఠశాలలు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలలోనే నిర్వహణ లోపంతో సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. కనీసం గత ప్రభుత్వం మంజూరు చేసిన పనులను కూడా కూటమి ప్రభుత్వం చేయడంలో పూర్తిగా విఫలమైందనే విమర్శలు పెద్ద ఎత్తున వెల్లువెత్తుతున్నాయి.



రామ్‌నగర్ మున్సిపల్ స్కూల్‌లో నీరు రాక నిరుపయోగంగా ఉన్న కుళాయిలు

ఇంటర్ ఫస్టియర్ పరీక్షల రద్దు తగదు

- రిటైర్డ్ ఆర్‌జేడీ గోపాల్ రెడ్డి



మాట్లాడుతున్న రిటైర్డ్ ఆర్‌జేడీ గోపాల్ రెడ్డి

ఒంగోలు టౌన్: ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం పరీక్షలను రద్దు చేయాలనుకోవడం అర్థంలేని నిర్ణయం అని రిటైర్డ్ ఆర్‌జేడీ గోపాల్ రెడ్డి అన్నారు. మొదటి సంవత్సరం పరీక్షలను రద్దు చేస్తే రెండో సంవత్సరంపై భారం పడుతుందని చెప్పారు. 20 నెలల పాటు చదివిన విద్యార్థులు ఒకేసారి పరీక్షలు రాయాలంటే ఇబ్బంది పడతారని స్పష్టం చేశారు. ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలను రద్దు చేయాలని, సిలబస్ ను మార్చాలని, ఇంటర్నల్ మార్కులు ఏర్పాటు చేయాలని ఇంటర్మీడియెట్ విద్యా మండలి బోర్డు చేసిన ప్రతిపాదనలపై ఆదివారం ఎల్బీజీ భవనంలో ఎస్ఎఫ్ఐ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఈ విషయంపై జనవరి 26వ తేదీలోపు అభిప్రాయాలు చెప్పమని అడగడం సహేతుకం కాదని, 1964లో కొఠారి కమీషన్ వేస్తే రెండు సంవత్సరాల పాటు చర్చలు జరిగిన తరువాత 1966లో దానిని అమలులోకి తెచ్చారని తెలిపారు. కనీసం ఏడాది పాటు దీనిపై విద్యావేత్తలు, మేధావులు, విద్యార్థి సంఘాల నాయకులతో చర్చలు నిర్వహించాలని సూచించారు. ఇంటర్మీడియెట్ రంగంలో పనిచేసే అపారమైన అనుభవం కలిగిన వారిని సంప్రదించకుండా కేవలం కార్పొరేట్ ప్రయోజనాల కోసం మాత్రమే ఈ నిర్ణయం తీసుకుంటున్నారని మంగమ్మ కాలేజీ రిటైర్డ్ ప్రిన్సిపాల్ ఏవీ పుల్లారావు విమర్శించారు. ఇంటర్నల్ మార్కుల విధానం విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వాన్ని అడ్డుకుంటాయని, ప్రశ్నించే తత్వం లేని చోట పరిశోధనలు జరగవని చెప్పారు. ఉమ్మడి జాబితాలోని విద్యా అంశాన్ని కేంద్రం చేతిలోకి తీసుకోవడం దుర్మార్గమన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్యా రంగాన్ని కాషాయీకరణ, కార్పొరేటీకరణ, వ్యాపారీకరణ చేస్తుందని మండిపడ్డారు. నిరుపేద విద్యార్థులను చదువులకు దూరం చేసే కుయుక్తులతోనే ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు రద్దు చేయాలని చూస్తున్నారని విశ్రాంత ప్రిన్సిపాల్ టి.వెంకటేశ్వరరెడ్డి విమర్శించారు. నిజంగా ఇంటర్ విద్య పై రాష్ట్ర ప్రభుత్వానికి ప్రేమ ఉంటే ప్రతి కాలేజీలోనూ ప్రాక్టికల్స్ నిర్వహించేందుకు ల్యాబొరేటరీలను ఏర్పాటు చేయాలని, ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని, బడ్జెట్లో విద్యకు తగినంత నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇవేమీ చేయకుండా ఇంటర్ పరీక్ష రద్దు చేస్తే విద్య అభివృద్ధి అవుతుందని చెప్పడం హాస్యాస్పదం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయంతో ఎస్సీ, ఎస్టీ నిరుపేద విద్యార్థులు చదువులకు దూరం అవుతారని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ వినోద్ అన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు విజయ్, బండి వీరాస్వామి, ఆరోన్, సాయి పాల్గొన్నారు.

రాష్ట్రంలో క్రీడలు నిర్వీర్యం

- యువత భవితవ్యంపై ఆటాడుకుంటున్న కూటమి ప్రభుత్వం
- ఆడుదాం ఆంధ్ర ప్రోగ్రాంతో క్రీడలను ప్రోత్సహించిన జగనన్న
- క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న బూచేపల్లి, తాటిపర్తి, హర్షిత్ రెడ్డి

యర్రగొండపాలెం: రాష్ట్ర ప్రజలను మోసగించే వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం క్రీడలను నిర్వీర్యం చేసిందని, యువత భవితవ్యంపై ఆటాడుకుంటోందని దర్శి ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, యర్రగొండపాలెం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్, పార్టీ ఒంగోలు పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకుడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనయుడు హర్షిత్‌రెడ్డి విమర్శించారు. ఈ నెల 13 నుంచి తాటిపర్తి ఆధ్వర్యంలో ప్రారంభమైన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా వారు విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం తమది కాకపోతే గ్రౌండ్ ఉండదని, అన్ని విధాలుగా అభ్యంతరాలు తెలుపుతారని, అనేక ఇబ్బందులకు గురిచేస్తారన్న విషయం తెలిసినా ఎన్ని కేసులు పెడుతున్నా లెక్కచేయకుండా ఎమ్మెల్యే తాటిపర్తి యువతను ప్రోత్సహించేందుకు వెనకబడిన ప్రాంతమైన యర్రగొండపాలెంలో క్రికెట్ టోర్నమెంట్ పెట్టడం సాహసంతో కూడిన పనేనని అన్నారు. టోర్నమెంట్ సందర్భంగా గ్రౌండ్‌లో సున్నం వేసే దగ్గర నుంచి అన్నీ తానై పనిచేసిన ఆయనకు యువతపై ఎంత మక్కువ ఉందో ఇట్టే తెలుస్తుందన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం యువతతోపాటు పేద ప్రజలను పట్టించుకునే పరిస్థితిలో లేదని, కేవలం తమ వర్గీయులకు సంపాదించిపెట్టే పనిలో ఉందని అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ కాలంలో అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి యువత దృష్టిని క్రీడలవైపు మళ్లించి మంచి భవిష్యత్తు ఇచ్చేందుకు ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న యువతీ, యువకులు, విద్యార్థుల నైపుణ్యాన్ని వెలికి తీశారని చెప్పారు. అటువంటి పరిస్థితి ఇప్పుడు లేకున్నా జగనన్నను ఆదర్శంగా తీసుకొని క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేయడం హర్షించదగిన విషయమన్నారు.



క్రికెట్ టోర్నమెంట్ విన్నర్ టీంకు ట్రోఫీ అందజేస్తున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, తాటిపర్తి చంద్రశేఖర్, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనయుడు హర్షిత్‌రెడ్డి

యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వ వచ్చిన తరువాత దోచుకునే పనిలో పడ్డారని, ఖర్చుపెట్టే పరిస్థితిలో వారు లేరన్నారు. ఈ దోపిడీ రాజ్యంలో పండుగలకు కూడా గడవనటువంటి దయనీయ పరిస్థితుల్లో పేదకుటుంబాలు ఉన్నాయన్నారు. వైఎస్సార్ అంటే ఒక భరోసా అని, ఆ భరోసాను యువతకు ఇవ్వటానికి, వారిని అన్నిరంగాల్లో ప్రోత్సహించటానికి ఇటువంటి కార్యక్రమాలను మరెన్నో చేసుకుందామని అన్నారు. టీడీపీ నేతలు తమ అధికారాన్ని అడ్డుపెట్టుకొని అర్హత ఉన్న వారిని ఉద్యోగాల నుంచి తొలగించారని, వారిపై కేసులు నమోదు చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తనపై కూడా శనివారం మరొక కేసు నమోదు చేశారని, టీడీపీ వర్గీయులు చేసే దోపిడీ, దుర్మార్గానికి, లూటీకి, లాలూచి కార్యక్రమాలకు అడ్డుగా ఉంటున్నామని కేసులు పెడతారని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడా కూటమి ప్రభుత్వం ఉందని ఎవరికీ అనిపించడంలేదని, యర్రగొండపాలెంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఉందన్నట్లు ప్రజలు భావిస్తున్నారని, వారికి తామందరం అండగా ఉండాల్సిన అవసరం ఉందని అన్నారు.

చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనయుడు హర్షిత్‌రెడ్డి మాట్లాడుతూ.. నాన్నగారికి యర్రగొండపాలెం నియోజకవర్గంపై ఎనలేని ప్రేమ ఉందని, ఈ నియోజకవర్గ ప్రజలకు తాము అండగా ఉంటామని అన్నారు. 7 రోజుల పాటు ఒక టోర్నమెంట్ జరపాలంటే ఒక వ్యక్తితో అయ్యేపనికాదని, ఒక వ్యవస్థ ఉండాలన్నారు. జగనన్న ఎంతో అద్భుతంగా తన పాలనలో క్రీడా స్ఫూర్తిని కలిగించారని చెప్పారు. అనంతరం విజేతలకు వారు మెమెంటోలతోపాటు నగదు బహుమతులు అందజేశారు. క్రికెట్ టీం విన్నర్‌గా నిలిచిన త్రిపురాంతకం హోం టీంకు రూ.50 వేలు నగదు బహుమతి అందజేసిన చాపలమడుగు పంచాయతీ సర్పంచ్ తమ్మినేని సత్యనారాయణరెడ్డి (సత్తిరెడ్డి), రన్నర్‌గా నిలిచిన గంజివారిపల్లె టీంకు రూ.30 వేలు అందచేసిన మర్రివేముల పార్టీ నాయకుడు ఎల్లారెడ్డి రోషిరెడ్డి, మూడో స్థానంలో నిలిచిన రేగుమానిపల్లె టీంకు రూ.20 వేలు అందచేసిన పార్టీ నాయకులు కె.ఓబులరెడ్డి, సయ్యద్ జబీవుల్లా, క్రీడాకారులకు భోజన సదుపాయాలు కల్పించిన భూమిరెడ్డి సుబ్బారెడ్డిలకు వారు కృతజ్ఞతలు తెలిపారు.



టోర్నమెంట్ సభలో మాట్లాడుతున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, వేదికపై తాటిపర్తి, హర్షిత్‌రెడ్డి

ముస్లింలకు దామచర్ల షాక్

- వైఎస్సార్ సీపీ హయాంలో దశరాజుపల్లి కుంట వద్ద కేటాయించిన ఖబరస్థాన్ రద్దు చేస్తానంటూ సొంత సామాజికవర్గానికి హామీ
- ఖబరస్థాన్ రద్దు చేసి పార్క్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడి
- ఎన్టీఆర్ వర్ధంతి సభలో "ఎవరో ముస్లింలకు ఇచ్చిన స్థలం" అంటూ వివాదాస్పద వ్యాఖ్యలు
- మండిపడుతున్న ముస్లింలు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ఎన్టీఆర్ వర్ధంతి రోజు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ముస్లింలకు షాక్ ఇచ్చారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇచ్చిన ఖబరస్థాన్ స్థలాన్ని రద్దు చేయనున్నట్లు బహిరంగంగా ప్రకటించారు. తనకు మంచి మెజారిటీ ఇచ్చిన మీ మేలు మరచిపోలేనని సొంత సామాజిక వర్గానికి కృతజ్ఞతలు తెలిపిన ఆయన కమ్మపాలెం అభివృద్ధికి పాటు పడతానని హామీ ఇచ్చారు. అందులో భాగంగా 'దశరాజుపల్లి కుంటలో ఎవరో ముస్లింలకు ఇచ్చిన ఖబరస్తాన్ స్థలాన్ని రద్దు చేసి ఆ స్థలంలో పార్క్ ఏర్పాటు చేస్తా'నని దామచర్ల ప్రకటించారు. ఇప్పుడీ మాటలు ముస్లిం సమాజంలో అగ్గి రాజేస్తున్నాయి. ఎన్నికలకు ముందు ముస్లింలకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చి ఇప్పుడు గెలిచిన తరువాత సొంత సామాజిక వర్గం కోసం అన్యాయం చేయడం దుర్మార్గమని మండిపడుతున్నారు.

ఏం జరిగిందంటే...

ఒంగోలు నగరంలో 35 వేల మంది ముస్లింలు ఉన్నారు. ఇంత భారీ సంఖ్యలో ఉన్న ముస్లింలకు కేవలం ఒక ఖబరస్థాన్ ఉంది. అంతర్గత రోడ్లు పోగా ఒక ఎకరం మాత్రమే సమాధులకు మిగిలింది. ఎవరైనా చనిపోతే ఇక్కడ సమాధి చేస్తుంటారు. నెల మొత్తంలో కనీసం 70 నుంచి 80 మంది మరణిస్తుంటారు. దాంతో ఈ స్థలం సరిపోవడం లేదు. గత కొన్నేళ్లుగా కొత్త ఖబరస్థాన్ ఏర్పాటు చేయాలని ప్రజా ప్రతినిధులను కోరుతున్నారు.

రెండు ఎకరాలు కేటాయించిన వైఎస్సార్ సీపీ సర్కార్...

ముస్లింల అవసరాన్ని దృష్టిలో పెట్టుకొని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఖబరస్థాన్ కోసం నగరంలోని దశరాజుపల్లి రోడ్డులో 2 ఎకరాల స్థలం కేటాయించింది. నగర పాలక సంస్థలో తీర్మానం కూడా చేసింది. అయితే ఇప్పుడీ స్థలాన్ని రద్దు చేసి పార్క్ నిర్మాణం చేస్తానని ఎమ్మెల్యే దామచర్ల బహిరంగంగా ప్రకటించడం ముస్లింలలో కలకలం రేపుతోంది. అదికూడా కమ్మపాలెం అభివృద్ధిలో భాగంగా ముస్లిం ఖబరస్థాన్ స్థలమే కావాల్సి వచ్చిందా అని ప్రశ్నిస్తున్నారు.


గతంలోనూ ఇదే వైఖరి...

2014 నుంచి 2019 వరకు దామచర్ల జనార్దన్ ఎమ్మెల్యేగా పని చేశారు. అప్పుడు కూడా ఆయన ముస్లింలకు వ్యతిరేకంగా వ్యవహరించారు. బండ్లమిట్ట మస్జీద్ ను కూల్చేందుకు ప్రయత్నాలు చేసినట్లు కొందరు ముస్లిం మత పెద్దలు, నాయకులు గుర్తు చేస్తున్నారు. అద్దంకి బస్టాండ్ సెంటర్లో ముస్లింల దుకాణాలను కూల్చి వేయడమే కాకుండా సుజాత నగర్లో మస్జీద్ నిర్మాణాన్ని అడ్డుకున్నట్లు చెబుతున్నారు. ఇప్పుడు తాజాగా కూడా ఆయన ముస్లింల ఖబరస్థాన్ స్థలంపై కన్నేశారని అంటున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మంజూరు చేసిన ఈ స్థలం ఖరీదైనది కావడం వలన కొంత మంది దీన్ని ఆక్రమించుకునే ప్రయత్నాలు చేస్తున్నారని, ఈ కుట్రలో భాగంగానే ఖబరస్థాన్ స్థలాన్ని రద్దు చేసే కుట్రలకు పాల్పడుతున్నారని ముస్లింలు విమర్శిస్తున్నారు. ఎమ్మెల్యే దామచర్ల తన నిర్ణయాన్ని మార్చుకొని ముస్లింలకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

- వామపక్ష పార్టీ డిమాండ్

ఒంగోలు టౌన్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అవమానకరమైన వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాను మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు డిమాండ్ చేశారు. అమిత్ షా రాష్ట్ర పర్యటనను వ్యతిరేకిస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని సాగర్ సెంటర్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్‌ను అవమానించిన అమిత్ షాకు ఆంధ్రప్రదేశ్‌లో అడుగుపెట్టే అర్హత లేదని తేల్చి చెప్పారు. ఆయన తక్షణమే రాజీనామా చేసి దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. టీడీపీ, జనసేన కూటమికి రాజ్యాంగం పట్ల ఏమాత్రం గౌరవం ఉన్నా అమిత్ షాతో బహిరంగ క్షమాపణలు చెప్పించాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పట్టించుకోక పోవడం సిగ్గుచేటని సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు విమర్శించారు. అమిత్ షా తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని సీపీఐఎంఎల్ నాయకురాలు ఎస్ లలిత కుమారి డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో సీపీఎం, సీపీఐ, సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న వామపక్ష పార్టీ నాయకులు



దిబ్బలరోడ్డులో రోడ్డుకు అడ్డంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ ఆర్చి



కోర్టు సెంటర్‌లో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకుండా ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగేలా నడిరోడ్డుపై ఏర్పాటు చేసిన భారీ ఫ్లెక్సీలు



అద్దంకి బస్టాండ్‌లో సుబ్బరామిరెడ్డి విగ్రహం సర్కిల్లో భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో రోడ్డు కనిపించక నిలిచిపోయిన వాహనాలు



పాతమార్కెట్ సెంటర్‌లో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకుండా స్ట్రీట్ లైట్ స్తంభానికి ఏర్పాటు చేసిన భారీ ఫ్లెక్సీలు



ఒంగోలు జీజీహెచ్ ఎదురుగా డివైడర్ల మధ్యలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో క్రాసింగ్ వద్ద ఢీకొట్టుకునే స్థితిలో ద్విచక్ర వాహనాలు

విచక్షణ మరిచి.. పసుపు ఫ్లెక్సీలు పరిచి..!

ఒంగోలు నగరంలో టీడీపీ నాయకులు, కార్యకర్తల అత్యుత్సాహం ప్రజల పాలిట శాపంగా మారింది. స్థానిక ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ జన్మదినం సందర్భంగా నగరంలోని రోడ్లపై అడుగడుగునా అడ్డదిడ్డంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకుంటే ఎలాంటి సమస్యా ఉండదు. కానీ, కనీస విచక్షణ లేకుండా రోడ్ల పక్కన, డివైడర్లపై, జంక్షన్లలో, మలుపుల్లో ఇష్టారాజ్యంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. దీంతో రోడ్లపై ప్రయాణించే వాహనదారులకు ఎదురుగా వచ్చే వాహనాలు దగ్గరకు వచ్చేంత వరకూ కనిపించక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎమ్మెల్యే జన్మదినం సోమవారం కాగా, శుక్రవారం నుంచే రోడ్లన్నింటినీ అడ్డగోలుగా ఫ్లెక్సీలతో నింపడంతో రెండు రోజులుగా పలు చోట్ల వాహనాలు ఢీకొని ప్రమాదాలు కూడా జరిగాయి. పలువురు గాయపడి ఆస్పత్రి పాలయ్యారు. నగరంలోని రోడ్లపై నిత్యం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అసలే అన్నీ ఇరుకురోడ్లు కావడంతో పాటు భారీ ఫ్లెక్సీల ఏర్పాటుతో మరింత ఇరుగ్గా మారిపోయాయి. జంక్షన్లలో నాలుగువైపులా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలతో అన్ని రహదారుల నుంచి వచ్చే వాహనాలు పూర్తిగా దగ్గరకు వచ్చేంత వరకూ కనిపించడం లేదు. దీంతో ప్రజలు ప్రాణాలు అరచేత పట్టుకుని రాకపోకలు సాగిస్తున్నారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాల్సిన ఎమ్మెల్యే కూడా పట్టించుకోకుండా టీడీపీ శ్రేణులను ఇష్టారాజ్యంగా వదిలేయడంపై తీవ్రస్థాయిలో విమర్శిస్తున్నారు. కలెక్టర్ నుంచి అధికారుల వరకూ ఇవే రోడ్లపై రాకపోకలు సాగిస్తుంటారు. ఫ్లెక్సీల కారణంగా వాహనదారులు అసౌకర్యానికి గురవడంతో పాటు ప్రమాదాలు జరుగుతాయన్న విషయం స్పష్టంగా తెలుస్తున్నప్పటికీ.. అధికార పార్టీ కావడంతో వారు కూడా తమకేమీ పట్టనట్లు చోద్యం చూస్తుండటాన్ని ప్రజలు అసహ్యించుకుంటున్నారు.

– సాక్షి, ఒంగోలు



కొత్తపట్నం బస్టాండ్ సర్కిల్లో...



బాపూజీ కాంప్లెక్స్ వద్ద కొణిజేటి రోశయ్య విగ్రహానికి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ



కేశవస్వామిపేట సర్కిల్లో స్ట్రీట్ లైట్ స్తంభానికి ఏర్పాటు చేసిన భారీ ఫ్లెక్సీలు



చర్చిసెంటర్‌లో వాహనదారులకు సిగ్నల్స్ కనిపించకుండా స్ట్రీట్ లైట్ స్తంభం చుట్టూ ఏర్పాటు చేసిన భారీ ఫ్లెక్సీలు



ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకుండా బండ్లమిట్ట వెళ్లే రోడ్డు మధ్యలో డివైడర్‌కు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

ప్రభుత్వ ఉద్యోగి బరితెగింపు

- టీడీపీ కార్యకర్త మాదిరిగా ఒంగోలు ఎమ్మెల్యే దామచర్లకు పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతూ ఫ్లెక్సీ ఏర్పాటు
- సాక్షాత్తూ కలెక్టర్ కార్యాలయానికి పక్కనే ఉన్న చర్చి సెంటర్‌లో ఫ్లెక్సీ ఏర్పాటు
- ఒంగోలు నగరంలో దాదాపు 20కిపైగా ఫ్లెక్సీల్లో ప్రభుత్వ ఉద్యోగి ఫొటోలు
- చోద్యం చూస్తున్న కలెక్టర్, జిల్లా వైద్యారోగ్య శాఖాధికారులు

ఒంగోలు సబర్బన్: కూటమి హయాంలో ప్రభుత్వ ఉద్యోగుల్లో కొందరు బరితెగిస్తున్నారు. ప్రభుత్వమే మాది.. మమ్మల్ని ఎవరేం చేస్తారనే అహంకారంతో కాలర్ ఎగరేస్తున్నారు. కొందరు ప్రభుత్వ ఉద్యోగులు ఏకంగా టీడీపీ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారు. ప్రజలు కట్టిన పన్నులతో జీతం తీసుకుంటున్న ఒక ప్రభుత్వ ఉద్యోగి టీడీపీ ఎమ్మెల్యేకి నగరంలో 20కిపైగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశాడంటే.. ప్రభుత్వ ఉద్యోగులు ఎంత విచ్చలవిడిగా వ్యవహరిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు చెబుతూ జిల్లా కేంద్రం నడిబొడ్డున ఒక ప్రభుత్వ ఉద్యోగి ఎక్కడబడితే అక్కడ అతని ఫొటోలతోనే ఫ్లెక్సీలు ఏర్పాటు చేశాడు. అది కూడా జిల్లా పరిపాలనా కార్యాలయమైన కలెక్టరేట్ వద్ద గల చర్చి సెంటర్‌లో భారీ ఫ్లెక్సీలను అతని ఫొటోలతోనే ఏర్పాటు చేశాడు. వాటిని చూసి ఇతర ప్రభుత్వ ఉద్యోగులంతా ముక్కున వేలేసుకుంటున్నారు. ఆ వివరాల్లోకెళ్తే..

వైద్యారోగ్యశాఖలో జిల్లా కోర్టు ప్రాంగణానికి ఆనుకుని ఉన్న మాతా శిశు వైద్యశాలలో పొన్నర్సు శ్రీహరి అలియాస్ బబ్లీ ప్రభుత్వ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. ఎక్స్ రే విభాగంలో టెక్నీషియన్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. రెగ్యులర్ ఉద్యోగిగా ఉంటూ ప్రభుత్వం నుంచి ప్రజల సొమ్మును జీతంగా తీసుకుంటున్న శ్రీహరి.. ఆ వైద్యశాలలో కూడా పచ్చచొక్కా వేసుకున్న టీడీపీ కార్యకర్త మాదిరిగా వ్యవహరిస్తున్నాడని ఇప్పటికే విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో టీడీపీకి చెందిన ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పుట్టినరోజు సందర్భంగా నగర ప్రధాన కూడలి అయిన చర్చి సెంటర్‌లో ఎమ్మెల్యే భారీ కటౌట్లతో పాటు తన ఫొటోలతో శ్రీహరి ఫ్లెక్సీ వేశాడు. చర్చి సెంటర్‌తో పాటు నగరంలోని జయరాం థియేటర్ సెంటర్, రాజాపానగల్ రోడ్డు, మరికొన్ని ప్రాంతాల్లోనూ ఎమ్మెల్యే ఫొటోలు, తన ఫొటోలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశాడు. సాక్షాత్తూ కలెక్టర్ కార్యాలయం ముందే ఫ్లెక్సీలు ఏర్పాటు చేశాడంటే జిల్లా అధికారులంటే కూడా లెక్కలేదన్నట్లుగా అతని తీరు ఉంది. జిల్లా వైద్యారోగ్య శాఖాధికారులు కూడా అతన్ని ఏమీ అనలేని పరిస్థితిలో ఉన్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎమ్మెల్యే జనార్దన్ అండదండలు అతనికి మెండుగా ఉన్నాయని, అందుకే ఇలా రెచ్చిపోతున్నాడని సహచర ఉద్యోగులు చెవులు కొరుక్కుంటున్నారు. ఎమ్మెల్యేకి ప్రభుత్వ ఉద్యోగి ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడాన్ని జిల్లా అధికారులు ఏ విధంగా పరిగణిస్తారో వేచి చూడాలి మరి.



ఎమ్మెల్యే దామచర్లకు ఫ్లెక్సీ వేసిన వైద్యారోగ్య శాఖ ఉద్యోగి శ్రీహరి అలియాస్ బబ్లీ

ఫ్లెక్సీల కారణంగా చర్చి సెంటర్‌లో రోడ్డు ప్రమాదం...

నగరంలోని ప్రధాన కూడలి అయిన చర్చి సెంటర్‌లో రోడ్లకు అడ్డంగా ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ జన్మదిన ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం కారణంగా ఆదివారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఎదుటి వాహనాలు దగ్గరకు వచ్చేంత వరకూ పూర్తిగా కనిపించకుండా జంక్షన్‌లో భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయటంతో ఈ ప్రమాదం జరిగింది. వాహనదారులు రాకపోకలు సాగించే సమయంలో ఫ్లెక్సీలు అడ్డుగా ఉండి ఇతర వాహనాలు కనిపించక ఫెక్సీల పక్కనే కారు, మోటారు సైకిల్ ఢీకొన్నాయి. దాంతో ద్విచక్రవాహనంపై వెళ్తున్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం స్థానిక జీజీహెచ్‌కి తరలించారు. ఈ ప్రమాదంపై ఒంగోలు నగర పోలీసులు కేసు నమోదు చేసేందుకు సన్నద్ధమవుతున్నట్లు సమాచారం.

వారం తర్వాత వెలుగులోకి రోడ్డు ప్రమాదం

- ఈ నెల 13న అత్తవారింటి నుంచి బయలుదేరిన వ్యక్తి కనిపించకుండా పోయిన వైనం
- 19న రాజంపల్లి సమీపంలోని కాలువ పక్కన ముళ్లపొదల్లో బుల్లెట్ వాహనం, మృతదేహం



శివకోటిరెడ్డి (ఫైల్)



ఘటన స్థలంలో శివకోటిరెడ్డి మృతదేహం

దర్శి: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన సంఘటన వారం తర్వాత ఆదివారం వెలుగులోకి వచ్చింది. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు... దర్శికి చెందిన మారం శివకోటిరెడ్డి (30)కి రెండేళ్ల క్రితం కొత్తపల్లి గ్రామానికి చెందిన కోమలితో వివాహం జరిగింది. శివకోటిరెడ్డి లారీలు బాడుగలకు తిప్పుతూ ఉంటాడు. వివాహం జరిగిన 8 నెలలకు గొంతు క్యాన్సర్ రావడంతో చికిత్స పొందుతున్నాడు. గొంతు ఆపరేషన్ కూడా చేశారు. ఈ క్రమంలో కోమలి తల్లిదండ్రులు తమ కుమార్తెను భర్త దగ్గర ఉంచడం ఇష్టంలేక పుట్టింటికి తీసుకెళ్లారు. తల్లిదండ్రుల వద్దే కోమలి ఉంటోంది. కోమలికి భర్త అంటే ఎంతో ఇష్టం. శివకోటిరెడ్డి కూడా తన భార్యకు తరచూ ఫోన్ చేసి మాట్లాడుతుంటాడు. అప్పుడప్పుడు కోమలి దర్శి వచ్చి శివకోటిరెడ్డిని కలిసి వెళ్తుంటుంది. శివకోటిరెడ్డి కూడా కొత్తపల్లి వెళ్లి కోమలిని కలిసి వస్తుంటాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 13వ తేదీ రాత్రి 1.40 గంటల ప్రాంతంలో శివకోటిరెడ్డి తన భార్య కోమలిని కలవడానికి కొత్తపల్లి వెళ్లాడు. అక్కడ భార్యతో మాట్లాడిన అనంతరం 2.40 గంటలకు బుల్లెట్‌పై దర్శి బయలుదేరాడు. పక్కన లక్ష్మీపురం మీదుగా వస్తుండగా, రాజంపల్లి సమీపంలోని రైల్వే బ్రిడ్జి వద్ద ఉన్న టర్నింగ్‌లో వేగంగా వస్తున్న బుల్లెట్ అదుపుతప్పి కాలువపైన ఉన్న ముళ్లపొదల్లోకి దూసుకెళ్లింది. శివకోటిరెడ్డి కూడా ముళ్లపొదల్లో పడిపోయాడు. అప్పటి నుంచి అతని ఫోన్ స్విచాఫ్ అయింది. అతని తమ్ముడు రమణారెడ్డి అయ్యప్పస్వామి మాల ధరించి ఇరుముడి కట్టుకుని ఈ నెల 13వ తేదీ శబరిమల వెళ్లాడు. తన అన్నకు ఫోన్‌చేయగా స్విచాఫ్ రావడంతో కనుమ పండుగ రోజు స్థానిక ఎస్సైకి ఫోన్ చేసి తన అన్న కనిపించడం లేదని చెప్పాడు. శబరిమల నుంచి ఇంటికి వచ్చి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం పక్క పొలం రైతు మందు కొట్టేందుకు వచ్చి వాసన వస్తోందని చూడగా, ముళ్లపొదల్లో బుల్లెట్ వాహనం, పక్కనే శివకోటిరెడ్డి మృతదేహం కనిపించాయి. ఘటన జరిగి వారం రోజులు కావడంతో మృతదేహం పూర్తిగా గుర్తు పట్టలేని స్థితికి చేరింది. దీంతో ఆ రైతు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి పక్కనే బుల్లెట్ వాహనం ద్వారా గుర్తించి కుటుంబ సభ్యులను పిలిపించగా, అది శివకోటిరెడ్డి మృతదేహంగా వారు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. శివకోటిరెడ్డి తండ్రి కూడా నాలుగు సంవత్సరాల క్రితం మృతి చెందారు.

ఏపీఆర్ఎస్ఏ అధ్యక్షుడిగా మధుసూదన్

- సెక్రటరీగా వాసుదేవరావు



నూతనంగా ఎన్నికైన ఏపీఆర్ఎస్ఏ జిల్లా కార్యవర్గం

ఒంగోలు అర్బన్: ఏపీఆర్ఎస్ఏ (ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్) జిల్లా కార్యవర్గ ఎన్నికలు ఆదివారం రెవెన్యూ భవనంలో నిర్వహించారు. ఎన్నికల కార్యక్రమానికి సీహెచ్ సురేష్‌బాబు, ఎస్‌కే మహబూబ్‌బాషా, పెంచల్‌రెడ్డి ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. ఎన్నికల్లో ఎటువంటి పోటీలేకపోవడంతో ఏకగ్రీవంగా జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఏపీఆర్ఎస్ఏ అధ్యక్షుడిగా కొత్తపట్నం తహశీల్దార్ పిన్నక మధుసూదన్‌రావు ఎన్నికవగా, సెక్రటరీగా నాగులుప్పలపాడు మండల డిప్యూటీ తహశీల్దారుగా ఉన్న ఆర్ వాసుదేవరావు ఎన్నికయ్యారు. అసోసియేట్ ప్రెసిడెంట్‌గా వీ కిరణ్, ఉపాధ్యక్షులుగా ఏ రవిశంకర్, జీ రజనీకుమారి, ఎ వెంకట భార్గవ రాజేష్, కే కాశయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పీఆర్ఎస్ శర్మ (రాము), స్పోర్ట్స్ కల్చరల్ సెక్రటరీగా ఎస్ రామనారాయణరెడ్డి, జాయింట్ సెక్రటరీలుగా కే శాంతి, కేకే కిషోర్ కుమార్, కే అశోక్‌కుమార్, బీవీ సుబ్బారావు, ట్రెజరర్ వీ శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా జే శ్రీనాథ్, ఎస్‌కే షాజహాన్, డీ వెంకటేశ్వరరావు, ఎన్ గోపి, వై ప్రశాంత్‌నాయుడు, పీ మాధవరావు, ఎం చైతన్యప్రకాష్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికైన నాయకులను పలువురు ఉద్యోగులు అభినందించారు. ఈ సందర్భంగా కొత్తగా ఎన్నికైన కమిటీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

మద్దిపాడు: వ్యక్తి అదృశ్యంపై ఆదివారం మద్దిపాడు పోలీస్‌స్టేషన్లో కేసు నమోదు చేసినట్లు ఎస్సై బి.శివరామయ్య తెలిపారు. ఎస్సై శివరామయ్య కథనం ప్రకారం.. టంగుటూరు మండలం కారుమంచికి చెందిన ఆత్మకూరు శ్రీనివాస్ ఒంగోలులో నివాసం ఉంటూ గుండ్లాపల్లి పారిశ్రామిక వాడలోని ఎమ్మెస్ గ్రానైట్ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. సుమారు 8 నెలల క్రితం ఇంట్లో చెప్పకుండా ఎటో వెళ్లిపోయాడని, ఇప్పటివరకు ఎదురుచూసినప్పటికీ రాలేదని అతని తల్లి ఆత్మకూరి అంజమ్మ ఫిర్యాదు చేసింది. ఆ మేరకు మద్దిపాడు పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేశారు.

ప్రాణం తీసిన మద్యం మత్తు

- కారు ప్రమాదంలో వ్యక్తి మృతి
- మరొకరికి తీవ్రగాయాలు
- మద్యం మత్తులో వేగంగా నడిపి స్తంభాన్ని ఢీకొట్టిన కారు



విద్యుత్ స్తంభంతో సహా వరి చేలోకి పల్టీలు కొట్టిన కారు



ఘటన స్థలం వద్ద గుమికూడిన స్థానికులు

దర్శి: మద్యం మత్తులో అతివేగంగా కారు నడపడంతో అదుపుతప్పి స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మాలపాటి అనిల్ (29) అనే వ్యక్తి మృతి చెందగా, మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన దర్శి మండలంలోని తూర్పువీరాయపాలెం గ్రామ సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తూర్పువీరాయపాలెం గ్రామానికి చెందిన మాలపాటి అనిల్ తన స్నేహితులైన యరమాల ధర్మారావు, ధర్నాసి చిన్నబాబుతో కలిసి ధర్మారావుకు చెందిన ఇతియోస్ కారులో తూర్పువీరాయపాలెం పొలిమేరకు వెళ్లాడు. అక్కడ తమతో పాటు తెచ్చుకున్న మద్యం తాగారు. అది సరిపోక ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న బొట్లపాలెం గ్రామం వెళ్లి అక్కడ కూడా మద్యం కొని తాగి తమ ఊరికి కారులో బయలు దేరారు. యరమాల ధర్మారావు కారు నడుపుతుండగా, అనిల్ ముందు సీట్లో కూర్చుని ఉన్నాడు. చిన్నబాబు వెనుక సీట్లో కూర్చుని ఉన్నాడు. మార్గం మధ్యలో వీరాయపాలెం సమీపంలో మలుపు వద్ద మద్యం మత్తు, అతివేగం కారణంగా కారు అదుపుతప్పి రోడ్డుకు కుడివైపు ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో కారు తిరగబడి మాగాణి పొలంలోకి పల్టీలు కొట్టింది. ముందు సీట్లో కూర్చుని ఉన్న అనిల్‌కు దెబ్బలు తగిలి బురదలో కూరుకుపోయి స్పృహ కోల్పోయాడు. చిన్నబాబు తలకు చిన్నపాటి గాయాలవగా, కారు నడుపుతున్న యరమాల ధర్మారావుకు ఎటువంటి గాయాలు కాలేదు. చుట్టుపక్కల వారు వచ్చి వారిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అనిల్‌ను డ్యూటీ డాక్టర్ పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. కారు ఢీకొట్టిన స్తంభం మూడు ముక్కలై విరిగిపోయింది. కారుతో సహా పక్కనున్న వరి చేలో పడింది. విద్యుత్ వైర్లు కూడా పీక్కుని వచ్చి చేలో పడ్డాయి. ప్రమాదాన్ని చూసిన వారు విద్యుత్ అధికారులకు ఫోన్ చేసి విద్యుత్ సరఫరా నిలిపివేయించారు. కారు పల్టీలు కొట్టిన తర్వాత కూడా ఇంజిన్ ఆగిపోలేదు. వైఫర్ కూడా తిరుగుతూనే ఉంది. మాగాణిలో పడటంతో క్షతగాత్రులు బురదతో నిండిపోయారు. చిన్నబాబుకు స్థానిక ఆస్పత్రిలో చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించారు. మృతుడు అనిల్‌కు భార్య, కుమారుడు ఉండగా, భార్య స్వప్న ప్రస్తుతం 9వ నెల గర్భిణీగా ఉంది. అనిల్ మృతితో గ్రామంలో విషాదం నెలకొంది. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.



అనిల్‌ను ఆటోలో ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం